క్లుప్తంగా

మీడియా పాయింట్ ప్రారంభం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం మీడియా పాయింట్‌ను ఈఓ బాపిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వివిధ మాధ్యమాల విలేకరులు పాల్గొన్నారు.

పి4 సర్వేలు సమగ్రంగా చేయాలి



పి4 సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సత్యవేడు: పేదరిక నిర్మూలన కోసం పి4 సర్వేలు సమగ్రంగా చేయాలని ఎంపీడీ చంద్రశేఖర్ ఆదేశించారు. శుక్రవారం సత్యవేడు పంచాయతీలో సచివాలయ సిబ్బంది పి4 సర్వేలు చేశారు. దీనిపై ఆయన మాట్లాడుతూ, వాట్సాప్ పరిపాలన ద్వారా సేవలు ప్రజలకు చేరువ చేయాలన్నారు. సర్వేలో భాగంగా విద్యుత్ బిల్లులు, ఏసీలు, టూవీలర్లు, ఫోర్‌వీలర్లు, కరెంటు చార్జీల వివరాలు, ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల వివరాలు సేకరించారు . పంచాయతీ సిబ్బంది వి.సునిత, ఎస్.ప్రియ, డి.త్రివేణి, వి.ధనలక్ష్మి, కే.కీర్తన, రాజేష్, ఎం.శ్రీహర్ష చేసిన సర్వేలను ఎంపీడీఓ, సెక్రటరీ ముని రవి కుమార్ పరిశీలించారు.

ప్రవాసాంధ్రుడి వితరణ



రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం వెదుళ్ల చెరువు గిరిజన కాలనీలో శుక్రవారం ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ పిల్లలకు యూనిఫామ్ పంపిణీ చేశారు. సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్ధాల రవిబాబు మాట్లాడుతూ, ఉద్యోగ రీత్యా లండన్‌లో ఉన్న తన మిత్రుడు అవినాష్ గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద పిల్లలకు ప్రతి ఏటా విద్యాసామగ్రి వితరణ చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాది ఉదయ్ కుమార్ రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు మేకల రమేష్, ఈసీ మెంబర్ డాక్టర్ కోదండరామిరెడ్డి, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతు రిజిస్ట్రీపై అవగాహన

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం ఎలమండ్యంలో శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారులు ఆంధ్ర ప్రదేశ్ రైతు రిజిస్ట్రీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి ఏడీఏ డి. మనోహర్ బాబు మాట్లాడుతూ, వెబ్ లాండ్‌లో భూమి ఉన్న ప్రతి రైతూ రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలని కోరారు. ఇప్పటి వరకు మండలంలో 70 శాతం నమోదు పూర్తయిందని, మిగిలిన రైతులకు కూడా ఈనెలాఖరులోపు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ సునీల్ కుమార్, రైతు సేవా కేంద్రం అధికారి లోకేష్, రైతులు పాల్గొన్నారు.

పాలాభిషేకం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): దేశంలో నారీ శక్తిని ప్రపంచం నలుదిశలా చాటేలా ప్రధాని నరేంద్ర మోదీ మహిళలను అగ్రస్థానంలో నిలుపుతున్నారని రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోవతి అన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖ గుప్తాను నియమించడంతో ప్రధానికి కృతజ్ఞతలు చెబుతూ శుక్రవారం సాయంత్రం ఆయన చిత్రపటానికి రేణిగుంట మండలం వెదళ్లచెరువు ఎస్టీ కాలనీలో కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు చంద్రారెడ్డి, తేజోవతి ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. మహిళా సాధికారతకు ప్రధాని ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

పోలీసులపై దౌర్జన్యం

- నలుగురిపై కేసు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): విధి నిర్వహణలో ఉన్న శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ పోలీస్ సిబ్బందిపై దౌర్జన్యానికి పాల్పడిన నలుగురి వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు.. హెడ్ కానిస్టేబుల్ హరిబాబు, కానిస్టేబుల్ హరి మోపూరుపల్లి గ్రామంలో ఓ కేసులో పాత నేరస్తుల కోసం వెళ్లి విచారిస్తుండగా అదే గ్రామానికి చెందిన చెరివి సుబ్రమణ్యం, చంద్రశేఖర్, బుజ్జమ్మ, రమణయ్య ఏకమై పోలీసులపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఈ విషయమై కానిస్టేబుళ్లు ఎస్ఐకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి అదుపులో తీసుకుని వరదయ్యపాళెం తహసీల్దార్ ఎదుట హాజరుపరిచినట్టు ఎస్ఐ తెలిపారు.

శివోహం..!

- శివరాత్రికి ముస్తాబైన ముక్కంటి ఆలయం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం శివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. ఆలయంలో విద్యుత్ దీపాలంకరణలు, పూల అలంకరణలు భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఇక ఆలయ ముఖద్వారాలైన భిక్షాల గాలిగోపురం, దక్షిణ గాలిగోపురం వద్ద స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. అలాగే నాలుగు మాడ వీధుల్లో విద్యుత్ దీపాలంకరణలు కూడా పూర్తి చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. శుక్రవారం భక్తకన్నప్ప ధ్వజారోహణంతో ఆలయంలో పూజలు ప్రారంభమయ్యాయి. శనివారం స్వామి వారి ధ్వజారోహణం నిర్వహించనున్నారు.



ఆలయ ధ్వజస్తంభం వద్ద పూల అలంకరణ





ఆలయంలో విద్యుత్ దీపాలంకరణలు, స్తంభాలకు కట్టిన అరటి పిలకలు



భిక్షాల గాలిగోపురం వద్ద ..

పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి బ్రహ్మోత్సవాలలో అలంకరించేందుకు చెన్నైకు చెందిన వ్యాపారవేత్త దొరై నాగరాజన్ శుక్రవారం తన తరఫున నాగేంద్రరావు ద్వారా 13 పట్టు పంచలు, 26 పట్టు చీరలను అందజేశారు. వీటిని ఆలయ ఈఓ బాపిరెడ్డి స్వీకరించారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం పలికి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

ఆలయానికి కూరగాయలు, గొడుగులు..

మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం నంద్యాలకు చెందిన ప్రసాద్ అనే దాత 25 టన్నుల కూరగాయలను వితరణగా అందజేశారు. ఈవో బాపిరెడ్డి స్వీకరించి దాతకు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా చెన్నైకి చెందిన హిందూ ధర్మార్థ సమితి ట్రస్టు ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆర్ఆర్ గోపాల్‌జీ ఐదు గొడుగులను వితరణగా అందజేశారు.

ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ

జలవినాయకస్వామి ఆలయం, రాములవారి ఆలయం, రాజగోపురాన్ని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పరిశీలించి బందోబస్తు ఏర్పాట్లపై అధికారులకు మార్గదర్శనం చేశారు. క్యూలైన్ల పర్యవేక్షణతో పాటు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ట్రైనీ ఐపీఎస్ హేమంత్, డీఎస్పీ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా అంకురార్పణ

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం రాత్రి ఆగమోక్తంగా వేదపండితులు శాస్త్రోక్తంగా అంకురార్పణ పూజలు నిర్వహించారు. ఈఓ బాపిరెడ్డి, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిరోధిద్దాం

రేణిగుంట (ఏర్పేడు): బాల్య వివాహాలను కలసికట్టుగా నిరోధించాలని ప్రగతి సంస్థ మండల కో–ఆర్డినేటర్ శిరీష కోరారు. బాల్య వివాహాల నిరోధంపై శుక్రవారం ఏర్పేడు మండలం బండారుపల్లెలో ప్రగతి సంస్థ అవగాహన ర్యాలీ నిర్వహించింది. మానవ హారం ఏర్పాటు చేసింది. ఆమె మాట్లాడుతూ, శ్రీకాళహస్తిలో శివపార్వతుల కళ్యాణోత్సవం రోజున ఎక్కడైనా బాల్య వివాహం చేస్తున్నట్టు తెలిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098, 100, 112 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. ఏఎస్ఐ హబీబ్ వుల్లా, హెచ్‌ఎం నిర్మల్ కుమార్, మురగయ్య, వెంకటేష్, అంగన్‌వాడీ టీచర్ బత్తెమ్మ పాల్గొన్నారు.

గరళ కంఠుడి చిద్విలాసం



కామధేనువు వాహనంపై గరళ కంఠుడు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లెలోని శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా 4వ రోజు శుక్రవారం రాత్రి కామధేనువు వాహనంపై విహరిస్తూ గరళ కంఠుడు భక్తులను కటాక్షించారు. తొలుత ఉదయం యాగశాల పూజ, పార్వతీ పరమేశ్వరుల ఉత్సవమూర్తులకు అభిషేకం, సాయంత్రం యాగశాల పూజ, పూర్ణాహుతి క్రతువులు ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేయ గురుక్కల్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే వివిధ ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ మండపంలో చిన్నారుల భరతనాట్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఆలయ ఈఓ లత, సిబ్బంది పర్యవేక్షించారు.

రుణాల ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దాసుకుప్పం గ్రామీణ బ్యాంకు మేనేజర్ రాసవిహారి

సత్యవేడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బీసీ కార్పొరేషన్ల స్వయం ఉపాధి రుణాల ఇంటర్వ్యూలు నిర్వహించారు. బీసీ కార్పొరేషన్49 యూనిట్లు, మైనారిటీ కార్పొరేషన్ 13 యూనిట్లకు బ్యాంకర్లు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 380 మంది దరఖాస్తులు ఇచ్చారు. సత్యవేడు స్టేట్ బ్యాంకు మేనేజర్ హరీష్‌కుమార్, కెనరా బ్యాంకు (శ్రీసిటీ) యుగేంద్రనాథ్, సూర్యకుమార్. దాసుకుప్పం గ్రామీణ బ్యాంకు మేనేజర్లు రాసవిహారి, సుబ్బారావు, ఎస్‌బీఐ(శ్రీసిటీ) వేణుగోపాల్ , ఎస్‌బీఐ రాళ్లకుప్పం సూర్యప్రకాష్ అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: మండలానికి మంజూరైన 41 బీసీ కార్పొరేషన్ రుణాలకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బ్యాంకర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 41 యూనిట్లకు 196 మంది దరఖాస్తు చేసుకోగా 164 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపీడీఓ ప్రసాద్ తెలిపారు. ఇంటర్వ్యూలు నిర్వహించిన వారిలో వరదయ్యపాళెంలోని రెండు ఎస్‌బీఐ బ్రాంచ్‌లు, చిన్న పాండూరు, వరదయ్యపాళెం, సంతవేలూరులోని సప్తగిరి గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్‌లు, అలాగే సంతవేలూరు యూనియన్ బ్యాంక్ అధికారులు ఉన్నారు.

ఘనంగా సరస్వతి పూజ



సరస్వతి పూజలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

వరదయ్యపాళెం: స్థానిక హైస్కూల్ ప్లస్ స్కూల్లో శుక్రవారం ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. తొలుత స్కూలు ప్రాంగణంలో సరస్వతి పూజ చేశారు. భక్తిశ్రద్ధలతో విద్యార్థులు హాల్ టికెట్లను ఉంచి, అర్చకులు మోహనాచార్యుల చేతుల మీదుగా సరస్వతి దేవిని ప్రత్యేక పూజలు చేశారు. ఓంకారం చుట్టూ దీపాలు వెలిగించారు. ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలని మొక్కారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణయ్య, ఎస్ఎంసీ చైర్మన్ ఉదయ్ కుమార్, పీడీ బందిల కుమార్, ఉపాధ్యాయులు శ్రీధర్, గోకులకృష్ణ, త్రిమూర్తి, వాణి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ, మాజీ ఎమ్మెల్యే నివాళి



లీలావతి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎంపీ, మాజీ ఎమ్మెల్యే

రేణిగుంట (ఏర్పేడు): ఏర్పేడు మండలం ఎండీ పుత్తూరులో వైఎస్సార్ సీపీ కార్యకర్త పాదిలేటి లీలావతి మృతి చెందారు. ఇది తెలుసుకున్న తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి శుక్రవారం ఆ గ్రామానికి వెళ్లారు. లీలావతి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి, పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆగమోక్తం.. గ్రామోత్సవం

శ్రీకాళహస్తి: భక్తకన్నప్ప గ్రామోత్సవం శుక్రవారం ఆగమోక్తంగా నిర్వహించారు. ధ్వజారోహణం అనంతరం భక్తకన్నప్ప ముక్కంటి వద్దకు చేరుకుని అక్కడి నుంచి జలవినాయక ఆలయం సమీపంలో బోయ కులస్తులు ఉభయదారులుగా ఏర్పాటు చేసిన విడిది మండపానికి వేంచేపు చేశారు. ఉభయదారులు ఉత్సవమూర్తికి వస్త్రాలు, ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం అక్కడి నుంచి గ్రామోత్సవం ప్రారంభమై సన్నిధివీధి నుంచి రాజగోపురం వరకు, ఆటు నుంచి చతుర్మాడ వీధుల్లో సాగింది.

సరిహద్దులు దాటుతున్న ఇసుక



దిగబడిన ఇసుక లారీని లాగుతున్న క్రేన్లు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం, జీపాళెం సమీపంలోని స్వర్ణముఖి నదిలో నెల రోజులుగా పగలు కూలీలు, రాత్రిపూట యంత్రాలు పెట్టి ఇసుక లోడేస్తున్నారు. ఆపై పక్కనే ఉన్న కొబ్బరి తోపులో డంప్ చేసి రాత్రి లారీల ద్వారా తమిళనాడు, కర్ణాటకకు తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే ఈ దోపిడీ జరుగుతుండడంతో అధికారులెవ్వరూ అటువైపు కన్నెత్తి చూసేందుకు కూడా సాహసించడం లేదు. శుక్రవారం తెల్లవారు జామున పాపానాయుడుపేట–రేణిగుంట రహదారి పక్కన మట్టి రోడ్డులో ఓ ఇసుక లారీ దిగబడింది. దిగబడిన లారీని బయటకు తీసేందుకు రెండు క్రేన్లతో ప్రయత్నించారు.

మాతృభాషను విస్మరించొద్దు



శ్రీకాళహస్తి: మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్

బుచ్చినాయుడుకండ్రిగ: మాతృభాషను కాదని పరభాషా వ్యామోహంలో కొట్టుకుపోరాదని తెలుగు ఉపాధ్యాయులు, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు యువశ్రీమురళి అన్నారు. బుచ్చినాయుడుకండ్రిగ, కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తెలుగుతల్లి, తెలుగు రచయితల వేషధారణలో ర్యాలీ చేస్తూ ఆకట్టుకున్నారు. యువశ్రీ మురళి మాట్లాడుతూ, తెలుగు భాషాభివృద్ధి మండలి నిత్యం భాషోన్నతికి చర్యలు తీసుకోకవడమే కాకుండా మంత్రిత్వ శాఖ ఏర్పాటుకు కృషి చేయాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో అన్ని ఉత్తర ప్రత్యుత్తరాలు, ఆదేశాలు, ఉత్తర్వులు మొదలైనవన్నీ తెలుగులోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం వ్యాస రచన, పద్యపఠన పోటీలలో విజేతలకు విలువైన పుస్తకాలు, పెన్నులను బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణయ్య, రూపేష్ కుమార్, తెలుగు ఉపాధ్యాయులు శ్రీనివాసులు, శిరోమణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాష దినోత్సవంలో ప్రిన్సిపాల్ నాగరాజునాయుడు , తెలుగుశాఖాధిపతి సంక్రాంతి రాజేంద్రుడు, వైస్ ప్రిన్సిపాల్ నరసింహవర్మ మాట్లాడారు. తెలుగు భాష గొప్పదనాన్ని వివరించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లి ఒడే బిడ్డకు తొలిబడి

సత్యవేడు: సంస్కృతీ సంప్రదాయాలతో పాటు మంచి నడవడిక నేర్పేది మాతృభాష తల్లి ఒడే బిడ్డకు తొలి బడి అన్ని హెచ్‌ఎం పాండురంగయ్య అన్నారు. శుక్రవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, మాతృభాషతోనే వికాసం సాధ్యమని, అయితే ఇప్పుడు ఆంగ్ల భాషా వ్యామోహం పెరిగిపోవడం..ఇది మాతృభాషపై ప్రతికూల ప్రభావం చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మాతృభాషను సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన ×భువన విజయం× లఘు నాటిక ఆకట్టుకుంది. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మనోహరుడు, వైవిఎస్ కుమార్, ఈ. రాజేష్, ఏ. బాలాజీ, ఎస్. కార్తిక్, శ్రీదేవి, సురేఖ, రఫీ, సుబ్బారాయుడు, పి. కృష్ణయ్య , విద్యార్థులు పాల్గొన్నారు.





సత్యవేడు: 'భువన విజయం' లఘునాటికను ప్రదర్శించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు, బహుమతులతో విద్యార్థులు.



బుచ్చినాయుడుకండ్రిగ వేషధారణలో ఉన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు